
ఆహ్లాదకర తీరం ఆధ్యాత్మిక మణిహారం



ఆహ్లాదకర వాతావరణానికి చిరునామా సాగరతీరం. అలలతో పోటీ పడుతూ కేరింతలతో చిన్నపెద్ద విహరించే ఆనందతీరం. ఆ ప్రకృతి సౌందర్యానికి మానసిక ప్రశాంతతను అందించే ఆధ్యాత్మికత తోడైతే అది అద్భుతమే.. సాగరానికి అభిముఖంగా దేవతలు కొలువైతే అటు పర్యాటకులకు.. ఇటు భక్తులకూ వరమే. అలా.. ఓ వైపు సాగరఘోష.. మరోవైపు వేద మంత్రోచ్చరణలు సందర్శకులకు అనిర్వచనీయమైన అనుభూతిని అందిస్తున్నాయి భీమిలి బీచ్ రోడ్డులోని ఈ ఆలయాలు. దీంతో ఈ ఆహ్లాదకర తీరం ఆధ్యాత్మిక మణిహారంగా విరాజిల్లుతోంది.

– కొమ్మాది

రుషికొండ శ్రీవారి ఆలయం



తిరుమల తిరుపతి దేవస్థానం రుషికొండలో నిర్మించిన శ్రీవారి ఆలయం సాగరతీరానికి మణిదీపంగా, శోభాయమానంగా దర్శనమిస్తోంది. ఇక్కడ కొండపై దేవేరులతో వేంకటేశ్వర స్వామి కొలువుదీరారు. శ్రీ హనుమాన్ ఆలయం, శ్రీవారి పాదాలు, గోదాదేవి, పద్మావతి అమ్మ వార్ల ఆలయాలు ఉన్నాయి. శ్రీవారిని నిత్యం వేలాది మంది భక్తులు దర్శించుకుంటున్నారు. తిరుమల దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతీ కార్యక్రమం ఇక్కడ శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. కొండపై నుంచి చూస్తే ఒంపులు తిరిగిన సముద్రం కనువిందు చేస్తుంది. అనుకున్న ప్రతీసారి తిరుమల వెళ్లలేని భక్తులకు ఆ లోటును తీరుస్తోంది ఈ ఆలయం.

భక్తి ఝరి .. రామాద్రి

భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేటలోని ఆధ్యాత్మిక అద్రిగా పేరు గాంచింది రామాద్రి. ఇక్కడ ప్రతీ అణువు రాముని స్మరిస్తున్నట్లు ఉంటుంది. ప్రతీ అడుగూ రామనామంతోనే ముందుకు సాగుతుంది. కోటి శ్రీరామ నామాలు గల 365 తులసి కోటలు, 108 కోట్లు శ్రీరామ నామ మహాస్తూపాలను ఇక్కడ ప్రతిష్ఠించారు. ఈ ప్రాంగణంలో 32 అడుగుల అభయాంజనేయ స్వామి భారీ విగ్రహం, శివుడు, వినాయకుడు, శ్రీరాముని ఆల**యం, శ్రీ వేంకటేశ్వర ఆలయం, కదంబ వన వాసిని, దత్తాత్రేయుడు, శ్రీకృష్ణుడు, నవగ్రహాల ఆలయాలు ఉన్నాయి. గోశాలతో పాటు ఎదురుగా సాగరుడు, ఆహ్లాదాన్ని కలిగించే పచ్చని వాతావరణంలో భక్తులకు మంచి అనుభూతి కలుగుతుంది.**



వేద నిలయం.. వారిజ

వేదాలకు నిలయమైన వారిజ ఆశ్రమం మంగమారిపేటలో కలదు. ఇక్కడ వేద పాఠశాల, నేత్ర విద్యాలయంతో పాటు హయగ్రీవ మందిరం ఉన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడ విద్యార్థులు వేద పఠనం చేస్తుంటారు. వందలాది మంది విద్యార్థులు ఇక్కడ వేదాలు నేర్చుకుంటారు.

దేశంలో మూడో క్షేత్రంగా ఇక్కడ శ్రీ లక్ష్మీ హయగ్రీవ మందిరాన్ని నిర్మించారు. బ్రహ్మ నుంచి వేదాలను మధుకైటభులనే అసురులు అపహరించుకుపోగా వాటిని రక్షించేందుకు భగవంతుడు హయగ్రీవుని అవతారం దాల్చిన సంగతి తెలిసిందే. ఆ అసురులను సంహరించి వేదాలను తిరిగి బ్రహ్మకు అప్పగించిన హయగ్రీవ స్వామిని వేద స్వరూపునిగా కొలుస్తుంటారు. అందుకే వేదాలను అధ్యయనం చేసే విద్యార్థులు ముందుగా హయగ్రీవుని దర్శించుకుని ప్రార్థన చేసేందుకు వీలుగా శ్రీ లక్ష్మీహయగ్రీవ స్వామిని ఇక్కడ ప్రతిష్ఠించినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగు గురువు చెప్పే పాఠంపై శ్రద్ధ లేకపోతే ఏర్పడే దోషం మధుకై టభులుగా రూపు దాల్చుతుందని.. జ్ఞానమనే హయగ్రీవుని చేతిలో ఆ దోషం హతమైన విధానాన్ని వివరిస్తుందన్నారు.



వారిజ ఆశ్రమంలో హయగ్రీవ మందిరం

అద్భుతం మొగదారమ్మ ఆలయం



సాగర్‌నగర్ మొగదారమ్మ ఆలయం

సాగర్‌నగర్ బీచ్ రోడ్డు వద్ద శ్రీ మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయం మహాద్భుతం. భారతీయ సంస్కృతి అద్దం పట్టేలా ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవచ్చు. ఈ ఆలయ ప్రాంగణంలో 12 రాశులు, 16 నృత్యకళలు, 12పుష్కర దేవతల రూపాలను శిలలపై మలిచారు. దానితో పాటు త్యాగరాజు స్వామి, వటపత్ర శాయి, శ్రీకృష్ణ పరమాత్ముని రూపాలు అడుగడుగునా దర్శనమిస్తాయి. ఇక్కడ అణువణువునా శిల్ప కళ ఉట్టిపడుతుంది.

12 సంవత్సరాల శిక్షణ



వారిజ వేద పాఠశాలలో 7 నుంచి 11 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలకు వేదాలు నేర్పిస్తాం. 12 సంవత్సరాలు శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్లు అందజేస్తాం. తెలుగులో మాట్లాడే బ్రాహ్మణులకు మాత్రమే ఈ అవకాశాన్ని కల్పిస్తున్నాం.

– సంతోష్, వారిజ వేద పాఠశాల నిర్వహకులు

ఇది మా అదృష్టం



ప్రముఖ పుణ్యక్షేత్రాలన్ని బీచ్ రోడ్డు వెంబడి ఉండటం తీర ప్రాంత వాసుల అదృష్టం. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి మొదలుకుని శ్రీ కృష్ణ పరమాత్ముని వరకు కొలువుదీరిన ఆలయాలన్నీ సమీపంలోనే ఉండటం ఏనాడో విశాఖ వాసులు చేసుకున్న పుణ్యం. బీచ్ రోడ్డు పర్యాటకంగా ఎంత అభివృద్ధి చెందిందో ఆధ్యాత్మికంగానూ అంతే పేరు గడిస్తుంది.

– సీహెచ్ వెంకట్, మంగమారిపేట

నిత్యం కలియుగ దైవాన్ని చూస్తున్నాం




తిరుపతి వెళ్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని చూడలేని వారికి ఇక్కడే శ్రీవారిని దర్శించుకునే మహాభాగ్యం విశాఖ వాసులకు దక్కింది. శ్రీవారి లడ్డు, పట్టువస్త్రాల సమర్పణ, స్నపన తిరుమంజనం, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వంటి కార్యక్రమాలు కనులారా చూసే భాగ్యం కలుగుతుంది. రుషికొండలో ఈ ఆలయాన్ని నిర్మించడం మనం చేసుకున్న పూర్వ పుణ్యఫలం.

– ఎ.పార్వతి, ఎండాడ



మొగదారమ్మ ఆలయంలో ఆకట్టుకునే శిల్పసంపద

దర్శనీయం.. ఇస్కాన్ మందిరం



ఇస్కాన్ మందిరం

వైజాగ్ నుంచి భీమిలి మార్గమధ్యలో సాగర్ నగర్ వద్ద శ్రీ రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర, జగన్నాథులు కొలువైన ఇస్కాన్ మందిరం మరో దర్శనీయ ప్రాంతం. కృష్ణ తత్వాన్ని, భగవద్గీతను, భక్తియోగాన్ని ప్రచారం చేసే ఈ మందిరం వద్ద నిత్యం సందడే. ఇక్కడ కృష్ణాష్టమి తదితర పర్వదినాలతో పాటు వారాంత పూజలను వైభవంగా నిర్వహిస్తారు. రాధాకృష్ణులను రోజూ ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేస్తారు.

క్లుప్తంగా


పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ శ్రీనివాస్

కొమ్మాది: పర్యావరణ పరిరక్షణతోనే భావి తరాల మనుగడ సాధ్యమవుతుందని గీతం ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాస్ అన్నారు. లేకుంటే భయంకర విపత్తులను మానవాళి ఎదుర్కొవలసి ఉంటుందని హెచ్చరించారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్లాస్టిక్‌ను విచక్షణారహితంగా వినియోగించడం వల్లనే అనర్థాలు జరుగుతున్నాయన్నారు. వ్యర్థాల సరైన నిర్వహణ ద్వారా కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో నవోదయ ప్రిన్సిపాల్ డా.వైఎస్ఎస్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రామాయణ ప్రవచనాలు



ప్రవచిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: మనకు ఉపకారం చేసిన వారికి ప్రత్యుపకారం చేయనివాడు మహా పాపాత్ముడని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. మధురవాడ గాయత్రి విద్య పరిషత్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల వద్ద జరుగుతున్న సంపూర్ణ రామాయణ ప్రవచనాల్లో భాగంగా మంగళవారం కిష్కింధ కాండ గురించి వివరించారు. వర్షాకాలం దాటి శరత్కాలం ప్రారంభమైనా సీతాన్వేషణను మర్చిపోయిన సుగ్రీవునిపై శ్రీరాముడు కినుక వహించడం, తర్వాత సుగ్రీవుడు ఎదురుపడలేక తారతో మాట్లాడించడం మొదలైన ఘట్టాలను వివరించారు.

మరో దూడకూ లంపీ స్కిన్ వ్యాధి



లంపీ స్కిన్‌తో బాధ పడుతున్న దూడ

తగరపువలస: ఇటీవల జీవీఎంసీ రెండోవార్డు సంగివలసలో పాడి రైతు అక్కరమాని మంగరాజు దూడకు లంపీ స్కిన్ వ్యాధి సోకడంతో సాక్షిలో ప్రచురించిన వార్తకు పశు వైద్యాధికారులు స్పందించి, వైద్యం అందించడానికి ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే వార్డులో జీరుపేటకు చెందిన కొల్లి సూర్రెడ్డి అనే మరో పాడి రైతుకు చెందిన దూడ కూడా లంపీ స్కిన్ వ్యాధితో బాధ పడుతోంది. ప్రభుత్వ పశువైద్యాధికారులు స్పందించని కారణంగా ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నట్టు బాధిత పాడిరైతు తెలిపారు. అయినప్పటికీ దూడ ఒళ్లంతా కురుపులతో నీరసించి, మృత్యువుతో పోరాడుతోందని రైతు వాపోయాడు.

ప్రత్యేక అలంకరణలో రాసపోలమాంబ



పుష్పాలు, నిమ్మకాయల అలంకరణలో అమ్మవారు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం బంతి, చామంతి పువ్వులు, నిమ్మకాయ దండలతో అలంకరించారు. ఈ అలంకరణకు లక్ష్మీపురం గ్రామానికి చెందిన కనకల గణపతి, సన్యాసమ్మ, కనకల సిద్దార్థ, శ్యామల సహాయ సహకారాలు అందించారు. మజ్జివలస తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఈ కాకులకు ఏమైంది ?



సంతపేటలో ఎగరలేక నేలపై ఉండిపోయిన కాకి

తగరపువలస: ఇటీవల భీమిలి చుట్టుపక్కల ప్రాంతాల్లో కాకులకు సంబంధించి వింత పరిస్థితి ఎదురవుతోంది. ఇవి పిట్టల్లా రాలిపోయి మృత్యువాత పడుతున్నాయి. సాయంత్రం వేళ అకస్మాత్తుగా ఆకాశం నుంచి నేలపై పడిపోయి, ఎగరలేక అచేతనంగా ఉండిపోతున్నాయి. జాలి పడి ఎవరు చేరదీసినా దగ్గరకు వెళ్లకుండా భయపడుతున్నాయి. కనీసం అరవడం లేదు. ఎవరు ఆహారం పెట్టినా ముట్టడం లేదు. పడిన చోటే రాత్రంతా ఉంటూ, మరుసటి రోజు చూసేసరికి మృత్యువాత పడుతున్నాయి. గత నెలలో బీచ్‌రోడ్డులో వరుసగా ఇలాంటి సంఘటనలు జరగగా, చిట్టివలసలో కూడా ఒకే ప్రదేశంలో మూడు కాకులు ఇలాగే ప్రవర్తించి, మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మంగళవారం సాయంత్రం సంతపేటలో ఇలాగే కాకి నేలపై పడి వింతగా ప్రవర్తించింది. కాకులకు ఇలా ఎందుకు జరుగుతుందంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా వీటిపై విష ప్రయోగం చేస్తున్నారా లేదా కాలుష్యానికి గురవుతున్నాయా అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కాకుల అకారణ మృతిపై కారణాలు అన్వేషించి, వాటిని రక్షించాలని పక్షి ప్రేమికులు కోరుతున్నారు.

తక్షణమే పనులు పూర్తి చేయాలి



అనంతుని గిరిపై నిర్మించిన సిమెంట్ ప్లాట్‌ఫాంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పద్మనాభం: అసంపూర్తిగా ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కాంట్రాక్టర్లను ఆదేశించారు.బీటీగా అభివృద్ధి చేసిన ఘాట్ రోడ్డును, గిరిపై పునర్నిర్మిస్తున్న అనంతుని శిఖరం, బీటీ వేయకుండా వదిలేసిన రెడ్డిపల్లి రోడ్డును మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతుని శిఖరం పునర్నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాదైనా ఎందుకు పూర్తి చేయలేదని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఫోన్‌లో ప్రశ్నించారు. జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, మాజీ ఎంపీపీ కె.లీలావతి, టీడీపీ మండల అధ్యక్షుడు కె.రమణ, నాయకులు కె.నగేష్ కుమార్, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కె.లక్ష్మి పాల్గొన్నారు.

అపురూపం.. స్వామి ప్రథమ దర్శనం

- కనులపండువగా రాధామదన్‌మోహన్ స్వామి ప్రాణప్రతిష్ట
- హరేకృష్ణ వైకుంఠంలో ముగిసిన మహోత్సవాలు



శ్రీరాధ, మదన్ మోహన్ స్వాముల ప్రథమ దర్శనం



ప్రథమ దర్శనం చేసుకుంటున్న భక్తులు



మేయర్ గొలగాని హరి వెంకట కుమారికి ఆశీర్వచనం అందిస్తున్న పూజారి

తగరపువలస: విశేష పుష్పాలంకరణలో శ్రీరాధా, మదన్ మోహన్ స్వామి ప్రథమ దర్శనం భక్తులను తన్మయులను చేసింది. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎం రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో ఐదు రోజుల పాటు జరిగిన విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేడుకలు మంగళవారం ప్రథమ దర్శనంతో ముగిశాయి. చైతన్య భవనంలో శ్రీరాధా, మదన్ మోహన్ స్వామి సన్నిధిలో భక్తులు అష్టోత్తరాలు, సంకీర్తనలు ఆలపించారు. హారతులిచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, తిరిగి సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 8 వరకు భక్తులకు స్వామి దర్శనాలు ఉంటాయన్నారు. భక్తులకు నిర్వాహకులు షడ్రసోపేత పదార్థాలతో విందు భోజనం ఏర్పాటు చేశారు.

దర్శించుకున్న మేయర్

ఈ సందర్భంగా నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ప్రథమ దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఐదు రోజుల పాటు ఘనంగా ఉత్సవాలు నిర్వహించిన హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులను అభినందించారు. వేడుకలలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, బొట్ట రామకృష్ణ, వానపల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను అంబరీష దాస, యదురాజ దాస పర్యవేక్షించారు.

వ్యాసరచన, ఉపన్యాస పోటీలకు ఆహ్వానం

తగరపువలస: భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీమండలి ఆధ్వర్యంలో ఈ నెల 23న జిల్లా స్థాయి వ్యాసరచన, ఉపన్యాస పోటీలు తెలుగు, హిందీ మాధ్యమాలలో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీవీ రామన్ జీవిత విశేషాలపై వ్యాసరచన, రామన్ ఎఫెక్ట్ అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. టెన్త్ నుంచి డిగ్రీ వరకు చదివే విద్యార్థులు ఈ పోటీలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. వివరాలకు 89856 47419, 89858 97419 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల భవితకు ప్రాథమిక స్థాయిలోనే పునాది



భీమిలిలో అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణలో పాల్గొన్న ఎంఈవోలు శివరాణి, జయప్రద, ఐసీడీఎస్ పీవో శ్రీదేవి

పద్మనాభం: విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాథమిక స్థాయిలోనే పునాదులు వేయా లని సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా ఏపీసీ జె.చంద్రశేఖరరావు సూచించారు. అంగన్ వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతిపై పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను ఎంపీడీవో ఎం.విజయ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ తరగతులను సందర్శించిన ఏపీసీ మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడంలో అంగన్‌వాడీల సేవలు కీలకమన్నారు. ఎంపీడీవో విజయ కుమార్ మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇదే పాఠశాలలో టెన్త్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఎంఈవోలు పి.రమణ, బాబూలాల్,సీఎంవో దేముడుబాబు, హెచ్‌ఎం బాలామణి, ఆర్పీలు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయ సందర్శన

ముందుగాచంద్రశేఖరరావు పద్మనాభం కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. కొత్తగా నిర్మిస్తున్న కంప్యూటర్ ల్యాబ్ గదులను పరిశీలించారు. టెన్త్, ఇంటర్ పరీక్షలకు సన్నద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

భీమిలిలో..

భీమునిపట్నం: చిన్నారుల పూర్వ ప్రాథమిక విద్యపై అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమం భీమిలిలో ప్రారంభమైంది. ఎంఈవోలు శివరాణి, జయప్రద, శిశు సంక్షేమశాఖ అధికారి శ్రీదేవి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యాశాఖ, ఐసీడీఎస్ సంయుక్తంగా అందిస్తున్న సర్టిఫికెట్ కోర్సులో శిక్షణ పొంది పిల్లలకు చక్కగా బోధించాలని సూచించారు. డీఆర్‌పీలు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫయర్ పునఃప్రారంభం



వాటర్ ప్యూరిఫయర్‌ను ప్రారంభిస్తున్న అప్పారావు

భీమునిపట్నం: భీమిలిలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం వాటర్ ప్యూరిఫయర్‌ను పునః ప్రారంభించారు. మరమ్మతులకు గురైన దీన్ని పాఠశాల పూర్వ విద్యార్థి, ఏపీ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.సి.అప్పారావు రూ. 20వేలతో బాగు చేయించి, ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలలో పిల్లలకు తన వంతు సాయాన్ని అందిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.